# పంజరపు బ్రతుకు

గూడు నుండి క్రిందపడ్డ పక్షి లేవలేకపోయింది. తన రెక్కల మీద తను ఎగురలేకపోయింది... దిక్కులేని పక్షి అయింది.

కోర్టు ముందర పెద్ద రావిచెట్టుమీది రకరకాల పక్షులు ఎగిరిపోతున్నాయి.— చెట్టుక్రిందికి కోర్టుపక్షులు ఒక్కొక్కటీ చేరుకుంటున్నాయి.

పార్వతి—అటూ ఇటూ పోలీసులు పహరా ఇస్తుండగా కోర్టు గదిలోకి వెళుతూంది.

ఆమెకు నా అన్నవాళ్ళెవ్వరూలేరు, వాదించడానికి ప్లీడరూ లేడు ప్లీడర్ని పెట్టడానికి డబ్బూలేదు.

ప్లీడర్ల గదిలో నల్లకోట్లు దయ్యాల్లా కదులుతున్నాయి. ఆకాశం మీద నల్లటి మబ్బులు అతివేగంగా క్రమ్ముకుంటున్నాయి.

ఒక వ్యక్తి గబగబా వచ్చిన వాడల్లా — పార్వతి లోపలకు వెళుతూండడం చూసి ఆశ్చర్యంతో నిలుచుండిపోయాడు. అంతవరకూ అక్కడే మనుషుల్లో కలిసిపోయి తలల సందుల్లోంచి చూస్తున్న వ్యక్తి అతని దగ్గరకు వెళ్ళాడు.

"అగ్గిపెట్టి ఉందా?" అందుకు

ఏమరపాటుగా వినిపించుకోకండా అగ్గిపెట్టి తీసి ఇచ్చాడు. తన ఆశ్చర్యం నుంచి ఇంకా తేరుకోకుండానే!

"ఏమిటలా చూస్తున్నారు... ఆమె మీకు తెలుసా?" అని అడిగాడు ఊరుకోకండా!

"ఆఁ!... తెలుసు" అని నాలుక కరచుకొని... "అబ్బే! ...తెలియదు... నా కేం తెలియదు..." అన్నాడు తడబడుతూ... "అయినా విచారణ జరుగుతుందిగా! వింటే తెలిసిపోతుంది..." అని మళ్ళీ సర్దుకొని అన్నాడు.

"ఆ... కోర్టులో నిజం, తెలిసి సేదేమిటండీ!" అని రెండోవాడు ఎగతాళి చేశాడు.

"అయితే మీకు తెలుసా ఏమిటి... ఆ నిజం!" అని అడ్డుప్రశ్న వేశాడు.

అబ్బే!... అబ్బే!... నాకేం తెలుసు? తెలియకే కదా మిమ్మల్ని అడిగాను" అని తడువుకుంటూ, వెక్కుతూ చెప్పాడు తెండవవాడు.

ఇద్దరూ సిగరెట్లు అంటించి ఆఖరి దమ్ము తృప్తిగా పీల్చి అవతల పారేసి— ఆతృతగా వెనక బెంచీలమీద ఎవరికీ కనపడకుండా కూర్చొని సినిమాలాగ చూస్తున్నారు... వింటున్నారు.

కోర్టు గడియారం పదకొండూ కొట్టి— ఆగిపోయింది ... బయట చిన్న చినుకులు ప్రారంభమయ్యాయి.

విచారణ ప్రారంభమయ్యేసరికి వర్షం లావయింది. కోర్టు పంచలో జనం కిక్కిరిసి ఉన్నారు... పంచపాళీల నుంచి వర్షం ధారలుకట్టి పడుతూంది. గొడుగులు నల్ల కలువల్లా విచ్చుకున్నాయి.

* * * *

పార్వతీశం ఏమీ లేనివాడు. తనూ, ఉంటున్న ఇల్లూ, బడిపంతులు ఉద్యోగం, పార్వతి. ఒక్క మగపిల్లాడినయినా కనకుండా ... అతని ఇల్లాలు ఏనాడో కన్నుమూసింది. ఇద్దరు కూతుళ్ళనీ ఎంతోఅభిమానంతో పెంచాడు. ఉన్నంతలోనే మంచి సంబంధాన్ని చూసి పార్వతిని శేఖర్ కిచ్చి పెళ్ళిచేశాడు. రక్తం ఓడ్చి కూడబెట్టిన మూడువేలూ ఖర్చుపెట్టి ఆ బరువు దింపుకొని ఆనందంగా పిల్లను పంపి గుండెమీద చేతులు వేసుకున్నాడు.

జమున కూడా ఎదిగేఉన్నది ఉన్నదిగులల్లా ఈమెకూ ఎక్కడో మంచి సంబంథం చూసి ఒకఅబ్బాయి చేతిలో పెట్టి పంపిస్తే మలేబాధ్యతా ఉంటదు. తననింక అడిగే వారుండరు... తనొక్కడూ ... ఎలాగో ఒక లాగ మిగిలిన జీవితం వెళ్ళబుచ్చేస్తాడు... ఇదీ అతని ఆలోచన.

పార్వతి భర్త శేఖర్ ఎంత మంచివాడులా పైకి కనపడతాడో లోపల అంత దుర్మార్గుడు. అతని మనిషిలోని 'మడిసి'ని పోల్చుకోవడం కష్టం. అత్తవారింటికి వెళ్ళిన కొద్దిరోజులలోనే, శేఖర్ మెత్తని పులి అని తెలుసుకుంది. పార్వతిని చూసి పెళ్ళి చేసుకున్నాడేగాని ... భార్యలా చూడలేదు. ఇంట్లో ఒక దాసి... అంతే!... అతనికి లేని. అలవాటులేదు అతనేం ఉద్యోగం చేసేవాడో, అసలు చేసేవాడో... లేదో ఆ భగవంతు డికే తెలియాలి. ఎక్కడెక్కడో తిరిగి రాత్రులు ఏ రెండు మూడు గంట లకో వస్తేవచ్చేవాడు. ఒక్కొక్కప్పుడు తూలుతూ... ఒక్కొక్కప్పుడు తూలనాడుతూ! పేకాట సరేసరి. ఇంట్లోకే స్నేహితులను తీసుకువచ్చే వాడు. వాళ్ళకు "టీ"లూ, టిఫిన్లూ అందించడం తన పని.

అన్నదమ్ములు ఎవరికి వారు సంబంధాలు తెంపుకొని వేరయిపో యారు. ముసలి తల్లి దండ్రులు ఇతని పోరు పడలేక ఏ మూలో...కలో గంజో త్రాగి బతుకుతున్నారు.

ఇంత చేస్తున్నా శేఖర్ పైకి తేలడు. పై వాళ్ళతో అతని ప్రవ ర్తన, మాటలు ఎంతో ఇదిగా ఉంటాయి. అందుకే అల్లుడంటే తన తం డ్రికి ఎంతో గురి! పార్వతి ఏ సుఖం లేకపోయినా ... లోపల ఎంత కుమిలిపోతున్నా తన స్థానం అక్కడ తప్పితే మరొక చోటలేదని గ్రహిం చింది తన గౌరవం. భర్త గౌరవం కాపాడుతూ తండ్రితో కూడా తన కష్టాలు చెప్పుకోకుండా గడుపుతూంది.

మరి కొన్నాళ్ళకి పార్వతీశం, రెండో కూతురు జమున వివాహం కూడా చేశాడు. ఉన్న ఇల్లుకాస్తా అమ్మి, ఇంకా ఏ చీకూ, చింతాలేదని సంతోషపడ్డాడో లేదో, అనుకోని ఘోరం ఒకటి జరిగిపోయింది.

జమున కాపరానికి వెళ్ళి ఆరు నెలలు అయిందో లేదో— అకస్మాత్తుగా, జమున భర్తకి మశూచికం వచ్చి కళ్ళుమూశాడు.

లేడిపిల్లలాంటి జమున గెంతులన్నీ— ఆగిపోయాయి, జీవితం-పూలు పూయవలసిన జీవితం రాలిపోయింది. కల కరిగిపోయింది.

ముక్కుపచ్చలారని జమున ఇంటికి రాగానే పార్వతీశం ఆ దెబ్బకు తట్టుకోలేకపోయాడు. పిచ్చివాడిలా అయిపోయాడు. పార్వతి, పార్వతి భర్త ఎంత ఓదార్చినా ఫలితం లేకపోయింది. అతను మరి లేచి తిరగడం ఎవరూచూడలేదు.

పార్వతి కొన్నాళ్ళు ఉండి వెళ్ళిపోయింది. జమున ఒక్కత్తే మంచంపట్టిన తండ్రికి సేవచేస్తూ వాళ్ళూ, వీళ్ళూ ఇచ్చిన దానితో కాలక్షేపం చేస్తూంది.

అక్కడితో వారి కష్టాలు తీరినా బాగుణ్ణు. కొద్ది రోజులలోనే జమున ఏమైపోతుందో అన్న బెంగతోనే, ఆ జముననే దిక్కులేని పక్షిని చేసి వెళ్ళిపోయాడు పార్వతీశం.

ఇహనేం చేస్తుంది జమున?... ఎక్కడికి వెళుతుంది?... తండ్రి లేడు... అన్నదమ్ములు లేరు... ఇక మిగిలింది పార్వతి అక్కయ్య.

పార్వతికి ఇంట్లో స్వాతంత్ర్యం, మాటకు విలువ లేకపోయినా ఈ విషయంలో మాత్రం శేఖరం కాదనలేదు.

పార్వతి గుండె చెరువయింది. ఆమె కంటికి జమున చెల్లాయిలా కనపడలేదు. తన కూతురులా భావించింది. ఆమెలో మాతృత్వం, జాలి, కరుణ అన్నీ పొంగి పొరలేయి. తన హృదయంలోకి తీసుకుంది. తన ఇంటికి తీసుకపోయింది.

ఆ తరువాత పరిస్థితులే పార్వతిని ఇంత మట్టుకు తీసుకవచ్చాయి. ఆమె ఎంత విశాల హృదయంతో, జాలి గుండెతో, చెల్లిని తనతో తీసుక వచ్చిందో... ఆ గుండె అంత మండిపోయింది. ఆ హృదయమంత తల్లడిల్లిపోయింది.

దిక్కులేని జమునని-తన చీరకొంగు నీడన ఉంచుకొని అదరించింది. చెల్లెల్ని కంటినీరు చూసి తను ఏకధారగా ఏడ్చింది. చెల్లెలి బ్రతుకు నేలరాలిన పూవులా మారిపోయినప్పుడామె మనసు ద్రవించిపోయింది. తనకు ఉన్నా లేకపోయినా...చెల్లెలి మనసు ఏ విషయంలోనూ బాధపడకుండా ఉండేట్టు చేసుకొనేది. ఆమెకు కల్గిన కష్టం,మరచిపోయేలా చేద్దామని సర్వవిధాలా ప్రయత్నించింది.

కొన్నాళ్ళుపోయాక జమునలో విచారచ్ఛాయలు తొలగిపోయాయి. పూర్వంలా ఆడుతూ పాడుతూ ఉంది. పోయిన చురుకుతనం, కొత్త అందం వచ్చాయి.

చెల్లెలిలో మార్పుచూపి పార్వతి సంతోషించింది.

అంతకు మించి తన భర్త పూర్వంలా ఊరుపట్టి తిరగడం తగ్గించాడు. తనతోను జమునతోనూ కబుర్లాడుతూ ఇంటి పట్టున ఉండడం అతనిలో మార్పు రావడంచూసి మరీ ఆనందించింది—ఈ మార్పులుతన మంచి కోసమే అని నమ్మిన పార్వతి ఊహాగానం...ఒక నాటి రాత్రి అపశ్రుతులు పలికింది.

ఒక నాటి రాత్రి తన సర్వస్వం ఒకరికి అంకితం అయిపోవడం తన కళ్ళారా చూసింది.

తన భర్త శేఖర్...తన చెల్లెలు జమున...! ఛీ...!సిగ్గుసిగ్గు...అవమానం!

ఎవరితో చెప్పుకుంటుంది...ఏం చేస్తుంది? తన ఆశాసౌధాలన్నీ తన కళ్ళ ముందే కూలిపోయాయి.

కళ్ళారా చూస్తున్నా ఏమీ అనలేకపోయింది. ఇటూ తన దిక్కుమాలిన చెల్లెలు...అటూ సర్వ స్వతంత్రుడు తన భర్త...ఏదీ బయట పెట్టుకున్నా తనకే!

ఆ మర్నాడు చెల్లెలి మొహం చూడలేకపోయింది. తన మనసూ.. శరీరమూ—చచ్చినట్లయిపోయింది. కాని—జమున రోజూకన్నా ఆనం

దంగా ఉన్నది. చలాకీగా, ఉషారుగా ఉన్నది. వయసులో పొంగు కళ్ళలో కాంక్ష...తప్పితే మరే...ఆలోచనాలేని అమాయకురాలు. జమునని చూసి ద్వేషానికి బదులు జాలి కలిగింది పార్వతికి. తన భర్తతో అలా ఉండడం కోపం తెప్పించినా, జమున స్థితిచూసి జాలి కలిగింది. తన కన్నా రెండేళ్ళు చిన్నది. అప్పుడే సుఖాలు, ఆశలూ తుడుచుకుపోయిన అభాగ్యురాలు.

భర్తపోయినంత మాత్రాన కోర్కెలు చస్తాయా! పాపం! తాను చూచిన జీవితమంతా ఎంత? ఏమీ తెలియని చిన్నతనం...ప్రేరేపించే కోర్కెలు...తీర్చుకోవాలని తప్పితే ఇంకేమని ఆలోచించగలదు. మరే విధంగా ఆలోచించగలదు? ఏమీ ఎరగనట్లు తన చెల్లెలు తనతో కలసి మాట్లాడుతూ ఉంటే ఆమె అమాయకత్వానికి నవ్వుకానేది...కోపం వచ్చేది కాదు!—ఆ కోపం, ద్వేషం తన భర్త మీదకు మరలింది. అతనంటే అసహ్యం పెంచుకుంది.

కాని ఎన్నాళ్ళు? తాను అనుకున్నట్లు ఆ కోర్కె తీరగానే సరిపో లేదు. రానురాను శేఖర్ పార్వతిని పూర్తిగా మరచిపోయి, జమునతో బాహాటంగానే ఉండడము ప్రారంభించాడు. పార్వతి మనసు గాయపడు తుందని కూడా ఆలోచించలేదు. ఆశ్చర్యం ఏమిటంటే...జమున కూడా భయపడలేదు. ఆమెకు తెలుసు, తనకూ బావకూ సంబంధంవున్న సంగతీ అక్కకు తెలుసని, అక్క ఏమీ అనదని...అదేమీ తప్పు కానట్లు ప్రవర్తించేది.

పార్వతి ఇంక సహించలేకపోయింది. తన భర్త ప్రవర్తన తనకు తెలిసినా ఇంత తీవ్ర పరిణామం వస్తుందని ఊహించలేకపోయింది. జమునను పొమ్మనగలదా? దానికి ఇల్లా? వాకిలా? తను తప్ప వేరేతోడూ నీడాలేదు. ఎక్కడకు పొమ్మంటుంది? అలాగని కళ్ళ ఎదురుగుండా ఎన్నాళ్ళని ఈ దురాచారం చూడగలదు.

భర్తను అనవలసిన మాటలన్నీ అంది. కాని అతడు వింటేనా? వినడు...తను చేయగల్గింది ఏమీలేదు.

"నేనూ, జమునా ఇలా ఉండడం నీ కిష్టమైతే ఉండు. లేకపోతే నీదారి నీది?" అన్న భర్త మాటలు శూలాల్లా తగిలాయి. అంతకన్నా అగౌరవం తనకు ఏమున్నది?

చెల్లెలిని సూచావాచాగా చీవాట్లేస్తే ఒకటే ఏడుపు... "నేనేం చేసేది. వెళ్ళిపొమ్మంటే ఎక్కడికయినా వెళ్ళిపోతాను. అక్కయ్యా!" అని సమాధానం...ఆమెను తన నోటితో వెళ్ళిపొమ్మనలేకపోయింది. పోనీ బావా మరదలే కదా అని సర్దుకోలేకపోయింది. పార్వతి మనసు పరిపరి విధాల పోతున్నది.

తాను కొత్తగా ఈ ఇంటికి వచ్చినప్పుడు కూడా తన భర్త రాత్రిళ్ళు పైనే తిరిగేవాడు. ఎప్పుడోగాని తను గుర్తుకు వచ్చేదికాదు. అలాంటిది ఇప్పుడు జమునని తన చెల్లెలిని వదలడంలేదు బయటకు వెళ్ళడమేలేదు. ఆమెకు ఆశ్చర్యంగానే ఉన్నది. ఒక్కొక్కరి అదృష్టం అది. తన భర్త దగ్గర తనకు లేని స్థానాన్ని తన చెల్లెలు ఆక్రమించడము అర్థం కాలేదు. ఆఖరుకు జమునే ఆ ఇంటి దానిలా అయ్యేస్థితికి వచ్చింది.

అందుచేత అక్కడింక తనకు స్థానం లేదని గ్రహించింది పార్వతి. ఉండి సాధించేదేమీ లేదు. అతని మనస్సు తనవైపు తిప్పుకో లేదు. ఇంక ఆ నరకంలో ఉండేకన్నా నిష్క్రమిస్తేనే మంచిదని భావించింది.

ఒకనాడు ఎవరికీ తెలియకుండా కట్టుబట్టలతో ఇల్లువదిలి వెళ్ళిపోయింది పార్వతి. పీడవదిలిందనుకున్నాడు శేఖర్.

అలా వెళ్ళిన పార్వతే ఇలా కోర్టులో నుంచుందా???

* * * *

పైన జోరుగావర్షం పడుతుంటే అది జ్ఞాపకం చేయడానికికాబోలు కోర్టు హాల్లో కూడా అక్కడక్కడ బొట్లు బొట్లు పడుతున్నాయి. సరిగ్గా నెత్తిమీద కురుస్తూ ఉండడంవల్ల మనవాళ్ళిద్దరూ విసుక్కుంటూ లేచి ఇవ

తలకు వచ్చారు. సిగరెట్లు వెలిగించి గట్టిగా నిట్టూర్పుల్లా వాటిని పీల్చి వదిలారు.

చెట్లమీద రెక్కలు తడిసిన పక్షులు ఆకుల సందున ముడుచుకొని ఉన్నాయి. పూర్తిగా ముద్దయి తడిసిన కుక్క ఒకటి ఎక్కడా నిలువ నీడ దొరకక తోకముడుచుకొని పరుగెత్తుకొని వచ్చి మనుషులు తలదాచుకున్న కోర్టు గుమ్మం ఎక్కింది. అంతవరకూ అక్కడ నిల్చున్న వాడు ఒక తాపు తన్నేడు. "కుఁయ్...కుఁయ్" మని అరుస్తూ బంతిలా ఇవతలబురదలో పడిలేచి...మరో దగ్గరకు పరిగెత్తింది నిస్సహాయంగా ఆ కుక్క—కాని ఎక్కడకువెళ్ళినా ఆ కుక్క బ్రతుకంతే. లోపల విచారణ ఇంకా జరుగుతూనే ఉంది.

"ఆ బిడ్డ నీ బిడ్డేనా?"

"అవును."

"ఎందుకంత పనిచేశావు?"

"వేరే దారిలేక"

"నీ కెవరూ లేరా?"

"నాకెవరూ లేరు. నేను పాపం చేశాను. ఒప్పుకుంటున్నాను. మీరు ఏ శిక్ష వేసినా అనుభవిస్తాను. మరి నన్నేమీ అడగకండి."

"అది కాదమ్మా! నువ్వు ఒప్పుకున్నంత మాత్రంలో నీకు శిక్ష పడినంత మాత్రంలో, నిజం తెలియవద్దా."

"నా దరిద్రం నిజం! దిక్కులేని జీవితం నిజం!! నేను చేసిన పాపం నిజం!!! ఇంతకన్న నిజం ఏం కావాలి?"

"అది కాదమ్మా! నువ్వేమీ చెప్పకపోవడం వల్ల నీ ఈ దుర్భరమయిన జీవితానికి కారకులయిన వారిని పిలిపించి, నిజం తెలుసుకొని శిక్షించడానికిన్నీ, న్యాయమైన తీర్పు చెప్పడానికిన్నీ, కోర్టువారికి అవకాశం లేకపోతున్నది.

"అక్కర్లేదు. ఎవరి కర్మకు వారే కర్తలు. నాకు శిక్షవేయండి చాలు!" ఈ విధంగా ఆమె ఎంత అడిగినా నిజం చెప్పలేదు.

* * * *

తర్వాత జరిగిన నిజం—

అలా బ్రతకాలని వెళ్ళిపోలేదు పార్వతి. గమ్యం లేకుండా నడచి, నడచి తెల్లవారకముందే ఆ చీకటిలో తానుకూడా కలసిపోదామనుకుంది.

అప్పటి కప్పుడే ఊరుదాటి చాలాదూరం వచ్చింది. తెల తెల వారుతూ ఉంది. ఇంక అట్టే వ్యవధిలేదు. తెల్లవారకముందే తన బ్రతుకు తెల్లవారిపోవాలి. అల్లంత దూరంలో ఒక తోట...తోటలో పెద్దబావి... బావి దగ్గరకు చిన్నటి దారి కనిపించింది! ఇకనేం! తనకదే దారి... అనుకుంటూ బావి దగ్గరకు వెళ్ళింది.

కళ్ళు మూసుకుని...భగవంతుణ్ని తలచుకుంటూ బావిలోనికి దూకింది. కాని దూకబడలేదు. ఎవరో తనను పట్టుకొని బలంగా ఇవతలకు లాగేశారు...ఎవరు?

ఎవరు నువ్వు? ఎందుకిలా నూతిలో పడబోయావు? అని అడిగింది ఆ గొంతు. భయంతోనూ, సిగ్గుతోనూ ఏమీ జవాబు చెప్పలేకపోయే సరికి—రెక్క పట్టుకుని గద్దించి...అడిగాడు.

"నన్నాపకండి!...నాకు ఎవరూ లేరు!...నాకు బ్రతకాలని లేదు" అని అంది పార్వతి.

"అలాగే కానీ!...మొదట నాతో వచ్చి నేను చెప్పేది విను... విని తర్వాత నూతిలో పడు!" అని చెప్పి చెయ్యి పట్టుకొని బలవంతాన తీసుకు వెళుతున్నాడు.

చెయ్యి విడిపించుకుంది...కాని, వెనకాలే నడిచింది. అప్పటి కప్పుడే తెల్లవారింది.

ఆ తోటలో చిన్న ఇల్లులా వుంది. అందులోకి తీసుకు వెళ్ళాడు. ఆ విధంగా మొదటిమారు ఆత్మహత్య విఫలమయింది. తర్వాత ఆశ్చర్యకరమయిన పరిస్థితులలో అతనికి దాసోహమయింది.

ప్రసాద్, ఆమెను రక్షించి ఎన్నో ఆశలు చూపాడు. ఏ లోటూ రాకుండా చూస్తానన్నాడు. చచ్చి సుఖపడే దేముంది? అని మంచి చేసుకున్నాడు...పార్వతికికూడా చావంటే భయంవేసి బ్రతకాలనే ఆశ పుట్టింది. ఏదో ఒక ఆధారం దేవుడు చూపెట్టాడు కదా? ఎందుకు చావలి? అనుకున్నది.

ప్రసాద్ కూడా ఆమెకు మాట ఇచ్చినట్లుగానే ఏ లోటూ లేకుండా చూసుకుంటున్నాడు. ఆమె తోటదాటి ఇవతల అడుగుపెట్టే అగత్యం లేకుండా చూశాడు. అతను తోటలో వున్నంతసేపు పార్వతిని వదలడు. ఒక్కొక్కప్పుడు రాత్రులు ఉంటాడు. ఒక్కొక్కప్పుడు పగలు ఉంటాడు. ప్రసాద్ గురించి పార్వతీ ఏ విషయాలూ అడగలేదు. ఆమెకు ఒక విధమయిన విరక్తి జీవితంమీద కల్గిన మాట నిజమే అయినా చావటానికి ఇష్టంలేక ఆ దొరికిన ఆధారాన్నిబట్టి కడుపుకు వస్తూంది. ఎంగిలాకులాంటి తన బ్రతుకుని కుక్కలు చింపిన విస్తరి చేయకుండా ప్రసాద్ ఆదుకున్నాడు, మధ్యలో ఆరిపోకుండా చమురు పోశాడు. అందుచేత అతనంటే విశ్వాసం వుంది. అక్కడ పని వాళ్ళంతా ఎంతో మర్యాదగా చూస్తారు. అదే ప్రపంచంగా చేసుకుంది.

"ప్రసాద్‌కు భార్య ఉందా...తన చెల్లెలు తన సంసారంలో ప్రవేశించినప్పుడు తనెలా ఆవేదన పడది? ఇప్పుడు తనుకూడా అలా ప్రవేశించిందా?..." అనే ఆలోచన పార్వతికి రాకపోలేదు. కాని స్వార్థం ఆమెలో ప్రవేశించింది. తన స్వంత చెల్లెలే తన గురించి ఆలోచించనప్పుడు తనకేం? అనుకుంది. తన చెల్లెలికి దిక్కు లేనట్లే తనకూ ఇప్పుడు దిక్కులేదు. మరేం చేయాలి? "భగవంతుడు చూపిన ఈ దారిని విడచి పెట్టకూడదు" అనుకున్నది.

కొన్నాళ్ళ తర్వాత పార్వతి తనలో కలుగుతున్న మార్పులను చూసి ఏడవలేక నవ్వసాగింది! తన బ్రతుకు పండబోతున్నది. కాని పండవలసిన స్థానంలో కాదు...జీవితం గాడి తప్పినా నడుస్తూనే ఉంది. "దీనికి గమ్యం ఎంతవరకో" అని ఆశ్చర్యపోతోంది.

ప్రసాద్ ఆ సంగతి విని, ఎక్కువ సంతోషించాడు. పార్వతికి కావలసిన సదుపాయాలన్నీ చేశాడు. మనసు పరి పరి విధాలపోయి అదోలా ఉంటే ఓదార్చేవాడు. "జరిగిపోయిన విషయాలను మర్చిపోయి ధైర్యంగా ఉండు" అని హెచ్చరించేవాడు.

పార్వతికి ఏ లోటూ లేకపోయినా, కొత్త మార్పు కొత్త ఆశలను పుట్టిస్తున్నా హృదయంలో ఏమూలో కలుక్కుమంటూనే ఉంది.

మంత్రసానిని ఆ తోటలోకే తీసుకువచ్చి పురుడు పోయించాడు. ఒకనాడు ఏ కష్టం లేకుండానే పండంటి మగబిడ్డని కన్నది పార్వతి.

"తన రాత బావుంటే ఈ బిడ్డ ఎక్కడ పుట్టవలసింది" అని ఒకోసారి అనుకున్నా... "ఎక్కడయితేనేమి?" అని సమాధానపరుచుకుంది.

ఆ పాపడిని చూసుకుని అగ్నిసాక్షిగా వివాహమాడిన దంపతుల్లాగే సంతోషించారు పార్వతీ, ప్రసాద్.

ఇంకా నెల తిరక్కుండానే ఒకనాడు ప్రసాద్ పార్వతితో:-

"పార్వతీ! నీ ద్వారా...నా కలలు పండేయి. అందుకు నేనెంత ఆనందిస్తున్నానో చెప్పలేను...ఒక సంగతి-ఇన్నాళ్ళా నువ్వడగలేదు—నేను ఇన్నాళ్ళా నీకు చెప్పనూలేదు—నాకు ఒక భార్య ఉంది. అందుకే తోటలో వుంచవలసి వచ్చింది...నా భార్యకు సంతానంలేదు-నిన్నొక మాట అడుగుతాను. ఏమీ అనుకోవు కదూ" అని అడిగాడు.

పార్వతి సంతోషంగా ఉన్నా ఏమడుగుతాడో అని సంశయిస్తూనే "ఏమిటిది?" అన్నట్లు చూసింది.

"మరేంలేదు...ఈ పాపని అక్కడ వుంచుతాను. నా భార్య కన్నబిడ్డకన్న ఎక్కువగా చూసుకుంటుంది. ఆమె కోరిక తీరుతుంది" అని అన్నాడు.

పార్వతి గుండెలు కలుక్కుమన్నాయి. కళ్ళంట నీళ్ళు ప్రవహించాయి.

"ఏడవకు పార్వతీ!...అప్పుడప్పుడూ తీసుకు వస్తూంటాలే!" అని అన్నాడు. ఆమె అప్పుడే అంగీకరించినట్లు, చూడలేకపోతే ఉండ గలదా! అని సానుభూతి కనబరుస్తున్నట్లు.

పార్వతికి పౌరుషం వచ్చింది. పొంగిపొరలుతున్న మాతృత్వం ఆమెలో సహనాన్ని పోగొడుతున్నది.

"వీల్లేదు, నా పాపను నేను ఇవ్వను. నేను వీడి మొహం చూసు కునే బ్రతుకుతున్నాను. క్షమించండి!" అని అనేసింది. బిడ్డను గట్టిగా హృదయానికి హత్తుకుంటూ.

ప్రసాద్ ఆ విషయమేదో చాలా తేలిగ్గా తీసి పారేసినట్టు—

"అలా ఆవేశపడకు పార్వతీ! నే చెప్పినది విను. మన ఆనందాని కేమీ అడ్డు వుండదు. భగవంతుడు మేలుచేస్తే మళ్ళీ మనకి బిడ్డలు కలుగ వచ్చుగా! ఆ నిర్భాగ్యురాలు పిల్లలో అని గోల పెడుతోంది. ఆమె కోర్కె తీర్చడంలో నీకు నష్టం ఏమీ లేకపోగా ఒక మంచిపని, త్యాగం చేసిన దానివవుతావు!ఎంతమంది తల్లులు అలా ఇవ్వడంలేదు" అన్నాడు.

"లేదు...లేదు...నేను అలా చేయలేను...నాకు తొలిపంట-నేను వదులుకోలేను...నేనంత త్యాగం చేయలేను. మీ ఇష్టం...ఇలా ఉండ మంటే ఇలా పడి వుంటాను-లేదా ఎక్కడికయినా పోతాను. నా బిడ్డ నాకు బరువుకాదు. ఎలాగో పెంచుకోగలను!" అని ఉద్రేకంతో అంది.

ఆమె మొండిపట్టుకి ప్రసాద్, ఇంకేమన్నా లాభంలేదని అప్పటికి మరేమీ అనకుండా ఊరుకున్నాడు.

తనకీ, తన బిడ్డకీ మరేమీ భయం లేదనుకుంది పార్వతి. తర్వాత ఎవరూలేని సమయంచూసి తన దగ్గర పనిచేస్తున్న 'లచ్చి' రహస్యంగా పిలిచి—

"అమ్మగారూ! యీయేల మీరు జాగ్రత్తగా బిడ్డను కాపాడు కోవాల!" అని అంది.

ఆ మాటలు జాగ్రత్తగా వింటూ "ఏమే...ఏమి జరిగింది" అని అడిగింది పార్వతి.

"ఇన్నాళ్ళూ ఎందుకని ఊరుకున్నానమ్మా ! కాని...నానూ— ఆడపుట్టుక పుట్టేను...నాకూ బిడ్డలున్నారు...ఇక వుండబట్టలేక సెప్తున్నా" అటూ ఇటూ చూస్తూ రహస్యంగా అంది లచ్చి.

"ఏమిటీ!...వేగిరం చెప్పు!" అని ఆత్రుతగా అడిగింది పార్వతి.

"నే చెప్పేననీ ఎవురితోనూ అనకమ్మా ! నీకు పుణ్యముంటుంది" అంది భయంగా.

"ఫర్వాలేదు చెప్పు!"

"ప్రసాదు బాబుగారు మాటలన్నీ అబద్ధాలు. నమ్మకండమ్మా !— ఆయనగారికి భార్యాలేదు...బిడ్డలూ నేదు...అంతా ఉత్తదే! ఏరికో అమ్మడానికి సూత్తన్నారు..." అంది లచ్చి.

"ఆఁ..." అని కొంతసేపు గుండెలు పట్టుకొని నమ్మలేక వుండిపోయింది పార్వతి.

"అవునమ్మా! నిజం! నేను చెవులారా విన్నాను ఆళ్ళూ, ఆళ్ళూ మాట్లాడుకుంటూంటే. ఐదొందల రూపాయలకి బేరమయిపోనాది. ఈ యేల బిడ్డని దొంగతనంగా తీసుకుపోవడానికి అంతా సెటిలయిపోనాది"

"అది నిజమా లచ్చీ!" అని ఏడవడం మొదలెట్టింది పార్వతి.

"అవునమ్మగారూ! ప్రసాదుబాబుకి పెళ్ళాంనేదు. పెడాకులూ నేదు. పట్నంలో ఇల్లుంది. గాని అదొట్టి జులాయి కొంప. ఎందుకూ పనికిరాని నాయాళ్ళందరూ వచ్చి పేకాటలూ, తాగుళ్ళూ, తందనాలూ ఆడతుంటారు. ఇప్పుడేటయినా ఆలోచించుకోండమ్మగోరూ—బాబును లచ్చించుకోండి!...ఆ తర్వాత ఏడిసి సచ్చినా నాభంనేదు...ప్రసాదు బాబు పాపని అడగటం ఇని మీతో అంటున్నాను" అని చెప్పి వెళ్ళిపోయింది.

ఎత్తయిన శిఖరాలనుంచి ఒక్కసారి క్రిందికి తోసినట్లయింది పార్వతికి.

"అంతకన్నా ప్రసాద్ అన్నట్లు అతనికే భార్య వుంటే ఆమెకి పెంపకం ఇచ్చి వేస్తేనే బావుండేది" అనుకుంది. ఇప్పుడు ఏం చెయ్య

గలదు? ఈ పద్మవ్యూహం నుండి ఎలా తప్పించుకోగలదు? తియ్యటి మాటల వెనుక ఎంత విషం? వెనక ఇంత తతంగం వున్నదని పార్వతి ఊహించనన్నా లేక పోయింది. అంతా నిజమనే నమ్మింది.

ఏం చెయ్యడానికి పాలు పోలేదు. ఎలాగూ తన బిడ్డను తన దగ్గర ఉండనివ్వడు. ఇది నిజం! తను ఎదిరించినా అతడు బలవంతాన లాక్కుపోతే ఏమీ చెయ్యలేదు. ఈ పరిస్థితుల్లో తనేం చెయ్యాలి!...బిడ్డలేకుండా తను బ్రతకలేదు. ఒక్కటే మార్గం—ఇహ అక్కడ వుంటే లాభంలేదు. ఒకసారి ద్వారాలు తెరుచుకు బయటపడింది కదా ! ఇప్పుడూ అదేదారి !

బిడ్డను ఒడిలోకి తీసుకొని బయలు దేరింది...గబగబా అడుగులు వేసింది...కాని—ఎవడో నక్కినక్కి వస్తున్నట్లు దూరంనుంచి చూసింది. వాడూ ఈమెను చూసి "ఆగు ఆ బిడ్డను ఇలా యిచ్చెయ్యి" అని అరచి మీదకు పరుగెట్టి వస్తున్నాడు.

పార్వతి గ్రహించింది. వాడెందుకు వస్తున్నాడో! సర్వనాశనం అయ్యే సమయం వచ్చింది. వాడి చేతిలో మాత్రం పిల్లాడు పడకూడదు. మెరుపులా పరిగెత్తింది. వెనకాల వాడూ పరిగెత్తాడు.

పార్వతికి ఎదురుగుండా పెద్ద బావి తప్పించి మరి దారి కనపడ లేదు. మరి ఆలస్యం చెయ్యలేదు. "భగవాన్ ! ఆఖరికి ఇదా దారి చూపెట్టావు! నేను దేనికయితే భయపడి ఇన్నాళ్ళు బ్రతికేనో...అదే నాకు శరణ్యమా!" అని అనుకుంది. వెనకాల వాడు దగ్గరవుతున్నాడు.

మరి వ్యవధిలేదు. వేరే దారిలేదు. కసాయివాడి చేతిలో అమ్మకానికి పెట్టేకన్నా ఇదే మంచిది...

అనుకొని...తన కన్న బిడ్డను...పదిలంగా ఆఖరుసారి హృదయానికి హత్తుకొని...విడదీసి ఆ బావిలో పడవేసింది. తనూ గట్టెక్కి దూకింది.

బిడ్డ పడిన చప్పుడు మాత్రమే వినపడింది. తానుమాత్రం పడకుండా వ్రేలాడుతోంది...ఏమయింది...వాడు...ఆ పాపాత్ముడు పడిపోతున్న తన చేయి పట్టుకున్నాడు.

"వదులు, వదులు" అని విడుల్చుకోబోయింది. వాడు వదలలేదు. పైకి ఈడ్చి నిలబెట్టేడు. పార్వతికి చైతన్యంలేదు. బిడ్డ తనకి దక్కలేదు. భగవంతుడెందుకిచ్చాడో...మళ్ళీ తీసుకున్నాడు. సొమ్మసిల్లి పడి పోయింది.

తెలివి వచ్చాక పార్వతిని తీసుకుపోయాడా వ్యక్తి. ఎక్కడికి ? ప్రసాద్ దగ్గరకు కాదు...పోలీసుల దగ్గరకు.

* * * *

బయట వర్షం తగ్గింది...ఆకాశంలో మబ్బులు విడిపోయాయి... పంచలంట బొట్టుబొట్టూ నీటి చుక్కలు రాలుతున్నాయి. కోర్టు వరం డాల్లో జనం పలుచబడ్డారు.

కోర్టులో జడ్జిమెంటు ఆఖరి ముక్కలు ఇలా వినపడ్డాయి.

"...కన్నబిడ్డను...బావిలో పడవేసి...తాను ఆత్మహత్య చేసుకొనబోయినట్లూ, ఆమె స్వయంగా ఒప్పుకొనడమువల్లనూ, ముద్దాయి చేసిన నేరాన్ని స్వయముగా చూసి వారించిన వ్యక్తి సాక్ష్యం వల్లనూ, ముద్దాయి నేరం చేసినట్లు రుజువయింది. అందువలన ముద్దాయి పార్వతికి యావజ్జీవ కారాగారశిక్ష విధించడమైనది" కోర్టులో ఆమెకు జరిగిన న్యాయమిది.

పార్వతిని ఇవతలకు తీసుకువచ్చారు. ఇటూ అటూ ఇద్దరు పోలీసులు కాపలా కాస్తూ వుంటే నడచిపోతూంది.

వెనక బెంచీలలో వున్న ఇద్దరూ ఆమె కంట పడకుండా జారుకుందికి ప్రయత్నిస్తున్నారు. కాని...ఆమె చూడనే చూసింది. ఒక్కసారి ఆశ్చర్యపోయి...ఒక అసహ్యమైన నవ్వు నవ్వి వెళ్ళిపోయింది. ఆ నవ్వును అర్థంచేసుకునే జడ్జీవుంటే కేసు ఇంకోలా నడిచేదేమో !

ఆ యిద్దరిలో ఒకడు శేఖర్, మరొకడు ప్రసాద్ అని ఆమెకు తప్ప ఎవరికి తెలుసు?

ఆ ఇద్దరూ ఎవరికివారే జడ్జిమెంటు విని "అమ్మయ్య" అని గుండెలమీద చేతులేసుకుని తేలికపడ్డారు. "నయం వాడుఅడిగేసరికి చెప్పాను కాదు!" అని నిబ్బరపడ్డారు ఎవరికివారు.

పార్వతికి చేసిన అన్యాయానికి పార్వతి ఏమీ చేయలేకపోయినా పార్వతి చెల్లెలు జమున ఆ పగ సాధించింది అనితెలిస్తే పార్వతి ఏమను కొనేదో! పార్వతి వెళ్ళిపోయాక జమున అక్కకోసం మంచం పట్టింది. శేఖర్ జముననుకూడా నిర్లక్ష్యంచేసి బాధపెట్టడం ప్రారంభించాడు. అది ఆమె సహించలేక ఒకనాడు చీరకొంగుతో ఉరిపోసుకు ప్రాణాలు తీసుకుంది. ఈ సంగతికాస్తా బయటపడి పోలీసు కేసు నడుస్తోంది. ఈ కేసు సందర్భంలోనే ఇప్పుడు శేఖర్ కోర్టులంట తిరుగుతున్నాడు. అతనే ఆమెను చంపినట్లు కేసు అడ్డంతిరిగే సూచనలు కనబడుతున్నాయి. తీర్పు ఎలావుంటుందో, అతనిగతి ఏమవుతుందో ఎవరికి తెలుసు? కోర్టుకి వచ్చి అకస్మాత్తుగా పార్వతిని అక్కడచూసి ఆశ్చర్యంతో ఏమవుతుందో ఏం జరిగిందో తెలుసుకుందామన్న కుతూహలం కొద్ది పొంచి కేసు అయేంతవరకు వుండి విన్నాడు.

తను చేసినపని బయటపడితే తనకే ఎదురవుతుందని కేసు సాక్షి ద్వారా పెట్టించి తాను తప్పుకొని ఏమి జరుగుతుందో అని చూస్తున్నాడు ప్రసాద్.

నేరంచేసిన వాళ్ళిద్దరూ పోలీసులకి దొరకక పోయినా పార్వతికి దొరికిపోయారు.

కథ ఇలా ముగిసింది.

కోర్టుదగ్గర పెద్ద రావిచెట్టుమీది పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి. చెట్టుకింది కోర్టుపక్షులు వెళ్ళిపోతున్నారు.

గూడునుండి కిందపడ్డ పక్షిని— ఆ ఎగరలేని పక్షిని—ఒకడు తీసుకెళ్ళి పదిలంగా పంజరంలోవుంచి కాసిన్ని నీళ్ళుపోశాడు. ఇంక ఆ పక్షికి అదే దిక్కు.

దిక్కులేని పక్షి పార్వతికి సెంట్రల్ జెయిలే దిక్కయినట్లు!!

ఆంధ్రజ్యోతి, 23-5-71